క్లుప్తంగా

వర్షం కోసం గ్రామ దేవతలకు పూజలు


గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కొక్కెరంచ పంచాయతీ నాగంపల్లి గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సుంకులమ్మ, పెద్దమ్మ, గంగమ్మ, లింగస్వామివార్లకు బలులు ఇచ్చారు. అదే విధంగా గ్రామానికి చెందిన నాగసుబ్బయ్య గ్రామ దేవతకు వెయ్యి టెంకాయలను కొట్టాడు. గ్రామ పెద్దలు హరి కృష్ణా రెడ్డి, రామేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారిపై కక్ష తగదు

శ్రీశైలంప్రాజెక్ట్: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై రాష్ట్రప్రభుత్వం కక్ష కట్టడం సమంజసం కాదని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ గంగుమాల శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కక్షసాధింపులు రాష్ట్రంలో ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సీఐడీ డీజీగా ఉన్న సునీల్‌కుమార్‌పై రఘురామకృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదుతో తప్పుడు కేసు నమోదు చేయడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినపుడల్లా అధికారులపై చర్యలకు పూనుకోవడం మంచి పరిణామం కాదన్నారు. ఆయనపై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కొలువుదీరిన పీర్లు


గాజులపల్లెలో కొలువుదీరిన పీర్లు

మహానంది: మొహర్రం వేడుకల్లో భాగంగా గాజులపల్లె, తిమ్మాపురం, బుక్కాపురం, తమ్మడపల్లె, అబ్బీపురం, పుట్టుపల్లె తదితర గ్రామాల్లోని మఖానాల్లో పీర్లు కొలువుదీరారు. ఆయా గ్రామాల ప్రజలు శుక్రవారం మఖానాలకు చేరుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ముజావర్లు మాట్లాడుతూ ఈనెల 14న చిన్న సరిగెత్తు, 15న మధ్య సరిగెత్తు,16న పెద్ద సరిగెత్తు వేడుకలు ఉంటాయన్నారు. 17వ తేదీన పీర్లు నిమజ్జనం జరుగుతుందని చెప్పారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డీఈ రఘురామిరెడ్డి

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామం వద్ద కేసీ కాలువలో రూ. 1.37 కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను కేసీ కాలువ నీటిపారుదల శాఖ డీఈ రఘురామిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. నెల రోజుల్లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఐఏబీ సమావేశంలో చర్చించిన అనంతరమే కేసీ కాలువకు నీటి విడుదల ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట నీటిపారుదల నందికొట్కూరు సెక్షన్ ఏఈఈ నరేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్లు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కిశోర్ శ్రీధర్ తెలిపారు. ఎంపికైన మదీహ ఫర్హానా(579), అరీఫ్ (576)లను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

బియ్యం పంపిణీ ప్రారంభం


సోనా మసూరి బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పేదలకు ప్రభుత్వం సోనా మసూరి బియ్యం కిలో రూ. 48కే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కిరాణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నాణ్యమైన సోనా మసూరి బియ్యం, కంది పప్పు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం కిలో బియ్యం రూ.48లకు, కిలో కంది పప్పు రూ.160తో సరఫరా చేస్తోందన్నారు. తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆగ్రహ జ్వాలలు

- బాలిక హత్యాచారంపై పెల్లుబికిన నిరసనలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని ధర్నాలు, ఆందోళనలు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

నందికొట్కూరు: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం నిరసనలు హోరెత్తాయి. మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఏపీ ఉమెన్ కమిషన్ రోకియా, రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని వాల్మీకి నగర్, వడ్డేపేట, పగిడ్యాల రోడ్డు మీదుగా పటేల్ సెంటర్ వరకు సీపీఐ ఏపీ రైతు సంఘం, వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముక్కుపచ్చలారని చిన్నారిని ముగ్గురు మైనర్లు లైంగిక దాడి చేసి కాలువలో తోసేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు త్వరలో కేసును చేధించాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు సోమన్న, రామకృష్ణ, భాస్కర్‌గౌడ్, మహేష్‌గౌడు, నాగన్న, డాక్టర్ చంద్రశేఖర్, శేషమ్మ, సరస్వతి పాల్గొన్నారు. అలాగే విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో పాఠశాలలను శుక్రవారం బంద్ చేయించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో ధర్నా చేశారు. విద్యార్థి జేఏసీ నాయకులు శేఖర్‌నాయుడు, ఆది, దిలీప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవమృగాలకు ఉరిశిక్ష విధించాలి

జూపాడుబంగ్లా: బాలికపై హత్యాచారం చేసిన మానవమృగాలకు ఉరిశిక్ష విధించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లాలోని మోడల్‌పాఠశాల, ఉన్నత పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజీ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కులో ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఊరి చివరికి తీసుకెళ్లి అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు అత్యాచారం చేసి మృతదేహాన్ని కనిపించకుండా చేశారని తెలిపారు. బాలిక ఆచూకీ కనిపించకుండా పోయి ఆరు రోజులైనా పోలీసులు మృతదేహాన్ని కనిపెట్టడంతో ఘోరంగా విఫలం అయ్యారని విమర్శించారు. బాలికలకు రక్షణ కల్పించడంతో పాటు హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని జూపాడుబంగ్లా గ్రామైఖ్య సంఘం సభ్యులు ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి మండల కన్వీనర్ నల్లబోతుల రాముడు డిమాండ్ చేశారు. తూడిచెర్ల గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శివశంకర్, పెద్దన్న, వెంకటేశ్వర్లు, వెంకటశివుడు, రామాంజనేయులు, వెంకటరమణ, లక్ష్మన్న, మహేష్‌బాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కొత్తపల్లి: చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను వెంటనే శిక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పాఠశాలలను బంద్ చేయించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. మృతిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, దిలీప్, లింగేష్, భరత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులను అడ్డుకున్న ప్రత్యేక బలగాలు

పగిడ్యాల: ఆరు రోజులుగా బాలిక మృతదేహం కోసం ఎదురుచూసిన గ్రామస్తులకు శుక్రవారం డీఐజీ రాకతో ఊపిరి వచ్చినట్లయింది. మృతదేహం గుర్తించేందుకు నిందితులతో కొత్త ముచ్చుమర్రికి చేరుకున్న డీఐజీ విజయరావును కలిసేందుకు బాధిత బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అయితే స్పెషల్ పార్టీ బలగాలు వారిని డీఐజీకి వద్దకు వెళ్లకుండా మధ్యలోనే అడ్డుకుని నిలువరించారు. దీంతో వారు కోపోద్రిక్తులై స్పెషల్ పార్టీ బలగాలతో వాదోపవాదానికి దిగారు. విచారణ సాగుతోందని ఎవరు కలవడానికి వీలు లేదని వారికి నచ్చజెప్పారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపులలో వాల్మీకి సంఘం నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసి హత్యచేసిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని త్వరగా గుర్తించాలని కోరారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

మహానంది: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజులపల్లె జయరాం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సీపీఎం మండల కార్యదర్శి కోటకొండ బాషా కోరారు. గాజులపల్లెలో శుక్రవారం రాత్రి ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.


జూపాడుబంగ్లా: కర్నూలు-గుంటూరు రహదారిపై ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


జూపాడుబంగ్లా: తరిగోపులలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు


గాజులపల్లెలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న దృశ్యం


నందికొట్కూరు: పటేల్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతు, దివ్యాంగ సంఘం నాయకులు


జూపాడుబంగ్లా: ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు మహిళలు


తూడిచెర్లలో వాల్మీకి సంఘం నాయకులు


పగిడ్యాల: గ్రామస్తులను అడ్డుకుంటున్న స్పెషల్ పార్టీ బలగాలు

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంఈఓ-2 శ్రీనాథ్

మిడుతూరు: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ -2 శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల సభ నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఆడపిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందించే సేవలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, కార్యకర్తలు శారద, రాధిక, మంగమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మాయమాటలతో మోసపోవద్దు


మాట్లాడుతున్న నిర్మల

జూపాడుబంగ్లా: మాయమాటలు నమ్మి బాలికలు, యువతులు మోసపోవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. 'మిషన్‌శక్తి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండ్లెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలు రుతుస్రావం సమయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో యువకులు, పురుషులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మిన్నకుండిపోవడం వల్ల ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి, ప్రమీలమ్మ, శ్యామలగౌరీ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

మహానంది: వర్షాకాలం కావడంతో దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బండిఆత్మకూరు కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ దాక్షాయని తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన రెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మమార్గంలో ముందుకెళ్లాలి


అల్లూరులో హిందూ ధర్మ ప్రచారం

నందికొట్కూరు: సనాతన ధర్మ మార్గంలో ప్రజలు ముందుకు సాగాలని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రచారకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో నాలుగు రోజులుగా జరిగిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు వక్తలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీతలోని సారాంసాన్ని తెలుసుకోవాలన్నారు. సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, నాగలక్ష్మయ్య, రత్నా కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, లక్ష్మన్న, నాగలక్ష్మయ్య, విష్ణు నాయుడు, చిన్న పుల్లన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 559 మార్కులు సాధించిన చరణ్‌సాయికి రూ.5 వేలు, 539 మార్కులు తెచ్చుకున్న ఇందుమతికి రూ.3 వేలు, 521 మార్కులు సాధించిన సాయిచరణ్‌కి రూ.2 వేలు నగదు అందజేశారు. 1986–87 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల గ్రూపు తరపున శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం నాగరాజు చేతులమీదుగా హెడ్‌కానిస్టేబుల్ నూర్‌అహమ్మద్, వలిబాషా, రామ్మూర్తి, పి.బి.శ్రీధర్, టీచర్ సలాం, ఖాజామియా, వలి, మల్లికార్జున, చంద్రశేఖర్, రాంప్రసాద్‌రెడ్డి, శేషన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు అందజేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


శాంతినిలయం గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. శుక్రవారం డ్రై డే ఫ్రైడే సందర్భంగా మండలంలోని యర్రగూడూరు మజారా గ్రామమైన శాంతి నిలయం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. గ్రామస్తులు ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయకుండా సహకరించాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు. యర్రగూడూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శివలింగస్వామి, వీఆర్వో కరిముల్లా ఉన్నారు.

మహానందీశుడికి పల్లకీ సేవ

మహానంది: శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారు పల్లకీలో విహరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, పండితులు శాంతారాం భట్, హనుమంతశర్మ, అర్చకులు శరభయ్య ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

పగిడ్యాల: పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి ప్రభుత్వం పంట సాగుదారుల హక్కు పత్రాలను జారీ చేసేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. మండలంలోని కౌలు రైతులు భూ యజమాని పట్టదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కౌలుదారు ఫొటో, కౌలుదారు ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు అగ్రిమెంట్ ఫారం, వీఆర్వోతో సర్టిఫై చేయించి రైతు భరోసా కేంద్రాల్లో సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ఆత్మకూరు: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ నుంచి చేపట్టిన ర్యాలీని మార్కెట్‌యార్డు, ఎంపీడీఓ కార్యాలయం, కొత్త బస్టాండ్, గౌడ్ సెంటర్ మీదుగా సాగింది. గౌడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మొక్కలు నాటండి అంటూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా ఫారెస్ట్ రేంజర్ ఎం.పట్టాభి, పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ చౌదరి, ప్రిన్సిపాల్ సుమిత్రారెడ్డి పాల్గొన్నారు.

కాలువ గట్టు వెంట చెట్ల తొలగింపునకు చర్యలు

పగిడ్యాల: బాలిక మృతదేహం ఆచూకీ కోసం పాత ముచ్చుమర్రి బ్రిడ్జి నుంచి పడమర వనుముల పాడు గ్రామం వరకు కేసీ కాలువ వెంట విస్తరించిన చెట్లను తొలగించాలని తహసీల్దార్ నాగేశ్వరరావు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం డీఐజీ విజయరావు కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చేరుకున్నారు. బాలిక మృతదేహం ఆచూకీని చూపించాలని నిందితులను అడుగగా శ్మశానం ప్రదేశం, పాత ముచ్చుమర్రి వైపున కేసీ కాలువ గట్టు వెంట ఉండే వసుందర పొలం వద్ద మరో ప్రదేశాన్ని చూపించారు. దీంతో డీఐజీ జంగిల్ క్లియరెన్స్ చేయించాలని అధికారులను కోరారు. స్పందించిన తహసీల్దార్ జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య శుక్రవారం తెలిపారు. కళాశాలలో బీ.ఏ.,బీ.కాం(కంప్యూటర్స్),బీ.ఎస్సీ కోర్సులు ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం నూతనంగా బీఎస్సీ (వృక్షశాస్త్రం) కోర్సు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. అడ్మిషన్‌లను ఈనెల 20వ తేదీ వరకు అనుమతిస్తామన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు తమ పేరును కళాశాలలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

కుటుంబంలో ఒక్కరికే పీఎం కిసాన్

పాములపాడు: కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పీఎం కిసాన్ వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు మీ సేవ కేంద్రంలో పీఎం కిసాన్ పథకం కోసం నమోదు చేసుకోవాలన్నారు. కాగా 2019 తర్వాత పొలం కొనుగోలు చేసి ఆన్‌లైన్ చేయించుకున్న వారికి ఈ పథకం వర్తించదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇన్‌కం ట్యాక్స్ పేయర్లు, రూ. 10 వేలకు మించి ప్రభుత్వ పింఛన్ పొందుతున్న వారు అనర్హులని చెప్పారు. పూర్తి సమాచారం కోసం వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన వై.సుప్రజ, మోక్షితగౌడు, ఎస్‌కే నష్ర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు. సుప్రజ, మోక్షితగౌడు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎస్‌కే నష్ర ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు లీగల్‌సెల్ భరోసా


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): కూటమి నెల రోజుల పాలనలో జరుగుతున్న దాడులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర సభ్యుడు పెద్ది శ్రీనివాసులు పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, విజయశేఖర్ భరోసానిచ్చారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కార్యాలయంలో లీగల్‌సెల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. దాడులకు తెగబడడం మానుకుని హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాపై దాడి చేసి, అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు ఇసుక మాఫియా, భూ కబ్జాలు, ఇళ్ల స్థలాల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో బాలికపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు అధైర్య పడకుండా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సభ్యులు తిమ్మారెడ్డి, ముక్కెరకృష్ణారెడ్డి, వసంత్‌కుమార్‌రెడ్డి, అల్లాబకాష్, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, ఓబులరెడ్డి, వనిపెంట కృష్ణారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

నంద్యాల(న్యూటౌన్): హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ రామకృష్ణ వివేకానంద ఆడిటోరియంలో హెల్మెట్లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన విషయాలను వివరించారు. మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇందులో ఎక్కువగా టూ వీలర్ ప్రమాదాల్లో ప్రాణనష్టం జరుగుతోందన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీజీ సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, జీపీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్‌లు తక్షణమే చెల్లించాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారిని కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఉద్యోగులపై దాడులు ఆపాలన్నారు. తాలూకా అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నర్సారెడ్డి, నాగరాజు, శేఖర్, నారాయణరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరమ్మ

కొత్తపల్లి: బాలికల సంరక్షణ, ఆడపిల్లల భద్రత అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాలికలు, ఆడపిల్లలపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాలికలకు, ఆడపిల్లలకు తోడుగా నిలవాలన్నారు. వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమాజాభివృద్ధిలో ఆడపిల్లల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, రాజశేఖర్ వెంకటాద్రి, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, రాములమ్మ, రాజమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.